క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎల్విన్‌పేట సీఐ బి.హరి మంగళవారం తెలిపారు. ఎల్విన్‌పేట, నీలకంఠాపురం, కురుపాం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఈ నెల 31వ తేదీ వరకు తనిఖీలు ముమ్మరంగా చేపడతామన్నారు. 10వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, 11 నుంచి 17వ తేదీ వరకు ఓవర్ స్పీడ్ తనిఖీలు, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ ధారణపై తనిఖీలు, 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని రకాల ఉల్లంఘనలపై తనిఖీలు చేస్తామన్నారు.

ఫీవర్ సర్వే చేయండి


ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యాధికారి తిరుమలప్రసాద్

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమలప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని ఆశ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించి, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే చేయాలని, ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, శిశువుల మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలు చేయాలన్నారు.

గృహ సందర్శన తప్పనిసరి


ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

గుమ్మలక్ష్మీపురం: ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలంతా క్రమం తప్పకుండా గృహ సందర్శన చేసి, ఎవరెవరు ఏయే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారో తెలుసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి.మణి సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రోగాల బారినపడకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందు పిచికారీ చేయాలని, ప్రజలు దోమతెరలు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. అనారోగ్యం బారినపడే వారు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు, సూపర్‌వైజర్లు శ్రీను, భారతి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాలి


విద్యార్థుల మధ్యాహ్న భోజనం చూసి సూచనలిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాలని గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో ఎల్.రజని తెలిపారు. మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. అక్కడి హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులతో సమావేశమై..మెరుగైన విద్యనందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమ ప్రాంగణంలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏఈవోలకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ ప్రకృతి వరప్రసాదమైన నేలతల్లిని మనమంతా కాపాడుకోవాలని, అది ప్రకృతి సేద్యంతోనే సాధ్యమన్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువుల విపరీత వాడకం వల్ల నేల కలుషితమైపోతోందని, సేంద్రియ ఎరువులు వినియోగించి నేల బాగుండేలా చూసుకోవాలన్నారు. ప్రతి రైతునూ ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సాహించాలన్నారు. ఏడాది కాలం పాటు పలు పంటలతో భూమిని కప్పి ఉంచే విధానం, ఏటీఎం మోడల్, ఏ-గ్రేడ్ మోడల్, అన్నపూర్ణ పొంటల నమూనా, వరుస పద్ధతుల్లో వరినాట్లు వేసుకోవడం, డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరినాట్లు వేయడం తదితర విషయాలను తెలిపారు. అలాగే పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు వాడే ద్రవ, ఘన, జీవామృతాలు, సేంద్రియ ఎరువుల తయారీని నేర్పించారు.

అమలు కాని హామీలతో కూటమి మోసం



భామినిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- బొడ్డగూడలో బాబు ష్యూరిటీ
- మోసం గ్యారంటీ
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

భామిని: గత ఎన్నికల సమయంలో అధికారం కోసం అమలు చేయలేని హామీలు, సూపర్ సిక్స్ పేరిట కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. మండల కేంద్రంతో పాటు బొడ్డగూడలో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కూటమి పాలకులు చేతులెత్తేశారని, ఇప్పుడు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ ఇచ్చిన మేనిఫెస్టో అమలుపై ప్రజలు నిలదీయాలని సూచించారు. ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నేడు సుపరిపాలన పేరిట ప్రజల వద్దకు వెళ్తున్న కూటమి నేతలకు ప్రజల ప్రశ్నిస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేసి ప్రజల కష్టాలను తీర్చారన్నారు. నేడు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ ఇలా ఏ ఒక్క పథకం కూడా సంపూర్ణంగా, సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అర్హులను అనర్హుల జాబితాలో చేర్పించి చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. పార్టీ నాయకులు తోట సింహాచలం, బోదెపు శ్రీనివాసరావు, రొక్కం రమేష్, పోతుల రేణుక, పతివాడ రమణమ్మ, చెప్పల కిశోర్, నిమ్మల సింహాచలం, మజ్జి మోహన్ బాబు, వలరౌతు వెంకటరమణ, జెల్లంకి రమేష్, పలువురు గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు

జియ్యమ్మవలస రూరల్:

మండలంలోని బొడ్డవలస, తుమ్మలవలస, జోగిరాజుపేట, నీలమాంబపురం, పరజపాడు, గదబవలస, లక్ష్మీపేట పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెచ్చులూడిన శ్లాబులు, పగుళ్లు ఇచ్చిన గోడలు, గచ్చులే కనిపిస్తున్నాయి. దీంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు బిక్కుబిక్కుమని గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా చినతోలుమండ, కొండనిడగళ్లు ప్రాంతాల్లోని పాఠశాలల భవన నిర్మాణాలు చిన్నచిన్న పనుల పెండింగ్ ఉండిపోవడంతో ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. త్వరితగతిన ఆ పనులు పూర్తిచేసి పాఠశాల భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


బొడ్డవలసలో పగుళ్లు ఇచ్చిన గోడ వద్ద పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలి

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు స్పష్టం చేశారు. పాలకొండ మండలం అన్నవరం పీహెచ్‌సీలో ఆశా దినోత్సవం పురష్కరించుకొని మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు చేపడుతున్న విధి విధానాలను మరింత మెరుగు పరచాలన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాలు ఆవశ్యకతను గర్భిణులకు, బాలింతలకు వివరించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు విజృంభించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అంకిత, హెచ్‌వీలు జగదీష్, వరలక్ష్మి తదితరులున్నారు.



ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకత, పౌష్టికాహార ప్రయోజనాలపై ఐసీడీఎస్ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ పాలే బిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. ప్రతి తల్లి కూడా పుట్టిన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పాలు ఇవ్వాలని, అలా అయితేనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ రోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


భామిని: కోసలిలో తల్లిపాలు వారోత్సవ ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీవో


సీతంపేట: పౌష్టికాహార ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


గుమ్మలక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు


కొమరాడ: కూనేరు రామభద్రపురంలో తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

ఆలయాలపై ప్రత్యేక నిఘా

గరుగుబిల్లి: ఆలయాల్లో చోరీలు జరుగుతున్నందున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని రావుపల్లి అయ్యప్పస్వామి ఆలయంలో ఇటీవల చోరీకి దుండగులు ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న ఆయన ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. తలుపులు, తాళాలు ఏ విధంగా విరగ్గొట్టారో క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

● సీతంపేటలో తిరంగ ర్యాలీ



సీతంపేట: సీతంపేటలో మంగళవారం తిరంగ ర్యాలీ విద్యార్థులతో నిర్వహించారు. ఈ నెల 15వరకు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీవో చిన్నబాబు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన పోలీసులు, కమిటీ సభ్యులు

పాలకొండ రూరల్: ఈ నెల 16 నుంచి పాలకొండ పట్టణంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నట్టు త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ పేర్కొంది. పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఈ వేడుకలను చేపట్టనున్నట్టు ఆ కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. దీనికి సంబంధించి పోలీసుల నుంచి అనుమతులు తీసుకున్నారు. వేడుకలకు సంబంధించిన పోస్టర్లను పోలీసుల సమక్షంలో ఆవిష్కరించారు.

సవర ఆర్ట్ అభివృద్ధికి కృషి

సీతంపేట: సవర ఆర్ట్ అభివృద్ధికి కృషి చేయనున్నట్టు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఏపీటీఐసీవో మంగళవారం నిర్వహించిన సవర ఆర్ట్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అభ్యర్థులు తీసుకున్న శిక్షణ అంశాలు అడిగి తెలుసుకున్నారు. సవర ఆర్ట్ మరింత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి


ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చుట్టూ ఇలా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

జియ్యమ్మవలస రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, బీజేపురం, గెడ్డతిరువాడ సబ్‌సెంటర్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పేరుకుపోయాయి. దీంతో విషపురుగులు, కీటకాలు, పాముల భయం సిబ్బందికి పట్టుకుంది. భయం భయంతో విధులు నిర్వహించాల్సి వస్తోందని, తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగిస్తే బాగుంటుందంటున్నారు.

మాంసం దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తాం

సాలూరు: నిబంధనలు పాటించాలని ఎన్నిసార్లు చెబుతున్నా వినకుండా, పదేపదే నిబంధనలు మితిమీరి మాంసం విక్రయాలు జరుపుతున్న దుకాణాల లైసెన్స్‌లు రద్దుచేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పట్టణంలోని పెద్దబజార్, ఆర్టీసీ కాంప్లెక్, జైపూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మాంసం విక్రయ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాపార ప్రాంతం వద్ద బ్లీచింగ్ పౌడర్, జాల్స్ వేయాలని సూచించారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా నిబంధనలు పాటించకుండా విక్రయాలు జరుపుతున్న వ్యాపారులపై మండిపడ్డారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి


దురిబిలిలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ ఎన్‌ఎఫ్‌ఏ రాజారావు

గుమ్మలక్ష్మీపురం: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని రైతు సాధికార సంస్థ ఎన్‌ఎఫ్‌ఏ రాజారావు సూచించారు. కురుపాం మండలంలోని దురిబిలి గ్రామానికి చెందిన నీలకంఠం, బాలెమ్మ, దుర్గ వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్న నవధాన్యాలు, లైన్ విధానంలో వేసిన వరి నాట్లు, ఏటీఎం మోడల్‌లో సాగు చేస్తున్న పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. వ్యవసాయానికి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తోందని, కిచెన్‌గార్డెన్ వేసుకోవడం వల్ల కుటుంబ ఆహార భద్రత సాధించుకోవచ్చన్నారు.

సర్వే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


సర్వే బృందం సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా సర్వే ఏడీ

వీరఘట్టం: సర్వే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా సర్వే ఏడీ పి.లక్ష్మణరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లు బృందంతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని రైతులకు వివాద రహిత భూమిని అప్పగించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వాటిని పరిష్కరించుకునేలా సర్వే టీమ్ చొరవ చూపాలన్నారు. సమావేశంలో మండల సర్వేయర్ సాహుకారు రమణమూర్తి, సర్వే డీటీ జి.ప్రసాదరావు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మల్లమ్మగూడ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల రిజర్వేషన్‌లపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయడం లేదని వాపోయారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు తప్పడం లేదని, మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబరు మూడు స్థానంలో వందశాతం ఉద్యోగుల కల్పనకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు యూటర్న్ తీసుకున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ఆదివాసీలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము, ఆరిక భానుచందర్, డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మౌలిక వసతులు కల్పించండి


సమావేశమైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

వీరఘట్టం: ఆసుపత్రికి వచ్చే రోగులకు మౌలిక వసతులు కల్పించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో సంచి డాక్టర్లు ప్రజలను దోచుకుంటున్నారని వారిపై దృష్టి సారించాలని వైద్యాధికారి బి.ప్రదీప్‌కు సూచించారు ఆసుపత్రి పక్కన శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపునకు తీర్మానించారు. సమావేశంలో తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం


ఇంటింటికి ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

సీతంపేట: ప్రజాసంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఎంపీపీ బి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని కుడ్డపల్లి పంచాయితీ పరిధిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు వివరించారు. అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు లేక గిరిజనులు అల్లాడుతున్నారన్నారు. రహదారులు, మంచినీటి వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయన్నారు. విద్య, వైద్య సమస్యలను పట్టించుకున్న నాథుడు లేరన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్ బాపయ్య, ఎస్.మోహన్‌రావు, గిరీష్, సంగమేషు, గణేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి


జూనియర్ కళాశాల విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ అధ్యక్షుడు

వీరఘట్టం: బాల్య వివాహాలపై విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధ్యక్షుడు శ్రీధర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలన్నారు. అనుచిత ప్రవర్తన చేసేవారు ఎంతటి వారైనా వెంటనే తల్లికి తెలియజేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో మహిళా పోలీసులతో మాట్లాడారు. సమావేశాల్లో ప్రిన్సిపాల్ త్రినాద్, ఎస్.ఐ కళాధర్, జిల్లా టీమ్ సభ్యులు హరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు మాకొద్దు మహాప్రభో..


విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బీవీ రమణ, ఎం.రమణ, కె.గౌరీశ్వరరావులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే కూటమి నాయకులు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి, ఇప్పుడు తెస్తుండడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్‌లను పెంచి పోషించేందుకే కూటమి స్మార్ట్‌మీటర్లను తీసుకువస్తోందని, దీనిని మనమంతా ఖండించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్లు ఉంటే రీడింగ్ వారి చేతుల్లోనే ఉంటుందని, ఎక్కువ యూనిట్ల విద్యుత్ వినియోగించినట్లు చూపించి, ఆ తర్వాత పథకాలు, రేషన్‌కార్డు తీసేస్తారని, ఈ మోసాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. అలాగే రీచార్జ్ చేసుకుంటేనే కరెంట్ అని, ఒక్క నిమిషం ఆలస్యమైనా కరెంట్ ఉండదన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయం మానుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.తిరుపతిరావు, ఎం.సన్యాసిరావు, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ స్థానిక జర్నలిస్టులు మంగళవారం తహసీల్దార్ శ్రీకన్యకు వినతిపత్రం అందజేశారు. పాత అక్రిడేషన్ల గడువు ఈ నెలాఖరుతో ముగియనుండడంతో కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయాలన్నారు. ప్రమాద బీమా పథకాన్ని పునఃప్రారంభించాలన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. హెల్త్‌స్కీమ్ ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బి.ఈశ్వరరావు, బి.కొండలరావు, పి.వైకుంఠరావు, పి.లోకేశ్వరరావు, ఐ.ఉమామహేశ్వరరావు, డి.యేసుబాబు, ఐ.వెంకటేశ్వరరావు, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.